# గురుసాక్షాత్ మరబొమ్మ



‘రోబో’లో వశీకరణ్ చేసిన యంత్రుడు.. సనకు పాఠాలు చెప్పాడు. బోరా మార్చిన చిట్టి రోబో ఆయనకే గుణపాఠం చెప్పింది. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు చేసిన మరమని‘షి’ పిల్లలకు బుద్ధిగా పాఠాలు చెబుతున్నది. కృత్రిమ మేధ సాయంతో పనిచేసే ఈ యంత్రిణి పేరు ‘మేడమ్ సుమన్’.

**ఉత్తర్‌ప్రదేశ్‌లోని** ఝాన్సీ జిల్లా రామాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా విధుల్లోకి చేరింది ‘మేడమ్ సుమన్’. ఈమె అందరిలాంటి టీచర్ కాదు. అచ్చంగా మనిషి చేతిలో రూపుదిద్దుకున్న హ్యూమనాయిడ్ రోబో. అందులోనూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేస్తుంది. దీనిని రూపొందించింది సాంకేతిక రంగంలో ఆరితేరిన శాస్త్రవేత్త కాదు. అదే పాఠశాలలో పనిచేస్తున్న మోహన్‌లాల్ అనే సామాజిక శాస్త్రం చెప్పే ఉపాధ్యాయుడు.. ఈ రోబోను సృష్టించారు.

### సిబ్బంది లేకనే..

రామాపూర్ పాఠశాలలో సిబ్బంది తక్కువగా ఉండటంతో.. పిల్లలకు పాఠాలు చెప్పడం, పాఠశాలను నిర్వహించడం ఇబ్బందికరంగా మారింది. దీంతో.. పిల్లల సమయం వృథా కావడంతోపాటు చదువుకూ దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. 2016లో పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం 30 శాతానికి పడిపోయింది. ఆ సమయంలోనే ఇక్కడ విధుల్లోకి చేరిన మోహన్‌లాల్.. హ్యూమనాయిడ్ రోబో ఆలోచన చేశారు. తన సొంత డబ్బులు ఖర్చుపెట్టి.. ఈ ఏఐ టీచర్‌ను రూపొందించారు. చెక్కతో బొమ్మ విడిభాగాలను తయారుచేసి.. స్క్రూలు, బోల్టులతో బిగించారు. తోలు బొమ్మ ముఖంతో.. టీచర్ ముఖాన్ని తీర్చిదిద్దారు. ముఖంలో సహజమైన హావభావాలు పలికించడానికి, కళ్లు రెప్పవేయడానికి, పెదవుల కదలిక కోసం ముఖం లోపల ప్రత్యేకమైన మోటార్లను ఏర్పాటుచేశారు. దీంతో తరగతిలోని వాతావరణానికి అనుగుణంగా.. హావభావాలను పలికిస్తుందీ రోబో టీచర్. దాంతో పిల్లలు కూడా మరింతగా కనెక్ట్ అవుతున్నారు. భవిష్యత్తులో ఈ మోడల్ నడిచేలా, చేతితో సంజ్ఞలు చేసేలా తీర్చిదిద్దుతానని మోహన్‌లాల్ చెబుతున్నారు.

### అలుపులేని టీచర్..

గూగుల్‌కు చెందిన ‘జెమిని’తో ‘మేడమ్ సుమన్’ పనిచేస్తుంది. స్మార్ట్‌ఫోన్ సాయంతో ఆపరేట్ అవుతుంది. ప్రతి పాఠాన్నీ ఆసక్తికరంగా, అందరికీ అర్థమయ్యేలా వివరిస్తుంది. పిల్లలకు పాఠాలపై ఉత్సుకత పెరిగేలా ప్రశ్నలు అడుగుతుంది. వారు ఆసక్తిగా సమాధానాలు చెబితే.. ‘మేడమ్ సుమన్’ వారిని ప్రశంసిస్తుంది కూడా! అందరిలా ఈ టీచర్ గుర్రుమనదు, తిట్టదు, కొట్టదు.. దాంతో.. పిల్లలు కూడా క్లాసులో ఎలాంటి భయం, బెరుకు లేకుండా ఉంటారు. తమ మనసులో తలెత్తే ఏ ప్రశ్ననైనా.. ఎలాంటి సంకోచం లేకుండా అడుగుతారు. వారు ఎన్ని సందేహాలు లేవనెత్తినా.. సరళంగా సమాధానాలు చెబుతుంది సుమన్. రోజంతా పాఠాలు బోధించినా ఏమాత్రం అలసిపోకుండా ఉంటుంది. దాంతో పాఠశాలలో హాజరుశాతం ఇప్పుడు 90 శాతం వరకూ పెరగడం రోబో టీచర్ మాయగా చెబుతున్నారు. ఈ మర టీచర్‌ను తయారు చేసిన మోహన్‌లాల్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు.





**కళా ప్రపంచంలో ఆడవేషం కట్టిన పురుషులెందరో లబ్ధప్రతిష్ఠులుగా ముద్రపడ్డారు. పురుషుడిగా ఆహార్యం మార్చుకున్న స్త్రీమూర్తుల ప్రస్తావన మాత్రం ఎక్కడో గానీ కనిపించదు. అలాంటి అరుదైన కళాకారిణి జమ్మ మల్లారి. ఉగ్గుపాల వయసు నుంచే ఒగ్గు కథలవైపు మొగ్గు చూపించిన ఆమె.. ఆరు దశాబ్దాలుగా అతనిగానే ఆ జానపద కళారూపాన్ని తన భుజాలపై మోస్తున్నారు. చిన్నప్పటి నుంచి పురుష ఆహార్యంలోనే కనిపించే మల్లారి.. కామరతి కళారూపం ప్రదర్శించినప్పుడు స్త్రీమూర్తిగా కనువిందు చేస్తుంది. ఒగ్గు కళకే తన జీవితాన్ని అంకితం చేసి, తెలంగాణలో ఒగ్గు కథ తొలి మహిళా కళాకారిణిగా గుర్తింపు పొందిన జమ్మ మల్లారి ప్రస్థానం ఇది..**

# ఒగ్గు కళను నెగ్గించింది

**జా**నపదానికి ఆలవాలం తెలంగాణ. తమ జీవితాన్ని ధారపోసి అంతరించిపోతున్న కళారూపాలను నిలబెట్టిన మహనీయులు ఎందరో! అలాంటి వారిలో ఒకరు జమ్మ మల్లారి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి ఆమె స్వగ్రామం. జమ్మ గుండాలు– చెన్నెమ్మ దంపతులకు ఏడుగురు ఆడకూతుళ్లు, ముగ్గురు కొడుకులు. వారిలో ఒకరు మల్లారి. ఆమె తండ్రి గుండాలు ఒగ్గు కళాకారుడు. దేవుడి లగ్గాలు చేయించేవాడు. ఆయన సంతానంలో ఎవరికీ పట్టుచిక్కని ఒగ్గు కథపై మల్లారికి చిన్నప్పుడే ఆసక్తి ఏర్పడింది. తండ్రితో దేవుడి లగ్గాలకు, ఒగ్గు కథ ప్రదర్శనలకు తోడుగా వెళ్తుండేది. తండ్రి కథ చెబుతుంటే.. తాళం కొడుతూ, డోలు వాయిస్తూ, రాగాలు తీస్తూ... మెలకువలు ఒడిసిపట్టింది. అలా చిన్నప్పటి నుంచే తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం చేసింది.



### పదహారేండ్లకే..

మల్లారి తన పదహారో యేట తొలిసారి సొంతంగా ఒగ్గు కథ చెప్పింది. మొదటి ప్రదర్శనతోనే అందరినీ కట్టిపడేసింది. అలా మొదలైన ఆమె ప్రస్థానం నేటికీ అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. విలక్షణమైన గాత్రం, సలక్షణమైన శ్రుతి లయలు ఆమె సొంతం. బీరప్ప గాథ, మల్లన్న కథ, ఎల్లమ్మ వృథ ఇలా ఏ దేవుడి చరితనైనా మల్లారి పూర్తి సాధికారతతో విడమరచి పాడేది. ఒగ్గు కథలు కేవలం మగవాళ్లకే పరిమితమైన రోజుల్లో ఆమె గజ్జెకట్టి, తలపాగా చుట్టి, భుజాన గొంగళి వేసుకొని.. పురుషుడి ఆహార్యంలో అనర్గళంగా కళను ప్రదర్శించేది. ఆమె ఒగ్గు కథ చెబుతుంటే.. ఎన్ని పనులున్నా ఒగ్గేసి ఊ కొడుతూ మైమరచిపోయేవారు జనం. ఆడపిల్లలు గడప దాటితే నేరమనుకునే ఆ రోజుల్లో తండ్రి ప్రోత్సాహంతో ముందడుగు వేసింది మల్లారి. సొంతూళ్లో మొదలైన ఆమె కళావిన్యాసం అనతి కాలంలోనే ఎల్లలు దాటి ఇతర రాష్ట్రాల్లోనూ చిందేసింది. మల్లారి ప్రదర్శన ఉందని తెలిస్తే చాలు.. చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలూ తండోపతండాలుగా తరలి వచ్చేవారు. తెలుగు రాష్ట్రాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చి.. తెలంగాణ ఒగ్గు కథకు తానెక్కిన ప్రతి వేదికపైనా పట్టం కట్టింది జమ్మ మల్లారి.

### దేవుడికే అంకితం..

కళా సేవలో తరిస్తున్న తన జీవితాన్ని సాధారణ మనుషులతో పంచుకోవాలని భావించలేదు మల్లారి. వేలాదిగా దేవుడి లగ్గాలు చేసిన ఆమె.. ఆ దేవుణ్నే మనువాడింది. తన పద్దెనిమిదో యేట బీరప్ప స్వామినే భర్తగా స్వీకరించింది. ఒగ్గు కథనే తన సంతానంగా భావించి, ఆ కళా రూపాన్ని పెంచి పోషించింది. తెలంగాణలో ఎక్కడ బీరప్ప కల్యాణం జరిగినా.. అక్కడ మల్లారి కచ్చితంగా ఉండాల్సిందే! ఆ స్వామి గాథను నోరారా వినిపించాల్సిందే అన్నంతగా ప్రశస్తి పొందింది ఈ జానపద కళారాజ్ఞి.



### అనర్గళం.. అప్రతిహతం..

మల్లారి బడికి వెళ్లి చదువుకున్నది లేదు. అయితేనేం, ఆమె ఏకసంతాగ్రాహి. తండ్రి చెబుతున్న కథలు విని మనో ఫలకంపై ముద్రించుకుంది. అందుకేనేమో, గంటల తరబడి సాగే ఒగ్గు కథలను ఎలాంటి పుస్తకాలు చూడకుండా అలవోకగా, తడబాటు లేకుండా చెప్పేస్తుంటుంది. ‘ఇప్పుడు వయసు పైబడటంతో ఎక్కువసేపు నిలబడలేకపోతున్నాను. కూర్చొనే కథ చెబుతున్నాను. నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకు ఒగ్గు కథ చెప్పడంలో తగ్గేదే లేదు. నేను ఎక్కడికి వెళ్లినా చక్కగా ఆదరిస్తున్నారు. ఇది నాకు దక్కిన గౌరవంగా భావించడం లేదు. ఒగ్గు కళ ద్వారా నాకు కలిగిన అదృష్టం’ అని వినమ్రంగా చెబుతారు 80 ఏండ్ల మల్లారి. ఆరోగ్యం అంతగా సహకరించకపోయినా ఒగ్గు కథ ఉందంటే చాలు మల్లారి సిద్ధమైపోతారు. శక్తినంతా కూడదీసుకొని కథను రక్తికట్టిస్తారు.

### తెలంగాణ వచ్చాకే గుర్తింపు

డెబ్బై ఏండ్లపాటు ఒగ్గు కథకు తన జీవితాన్ని అంకితం చేసిన జమ్మ మల్లారిని అప్పటి ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మల్లారికి సరైన గుర్తింపు లభించింది. తన ప్రాణం పెట్టి ఒగ్గు కళకు జీవం పోసిన మల్లారికి 2020లో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారాన్ని ప్రదానం చేసింది. లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించింది. ఆమె చెప్పిన ఒగ్గు కథలు.. ఈ జనపద కళారూపాన్ని మరింత కాలం పదిలంగా కాపాడతాయని చెప్పడంలో సందేహం లేదు.

... మడ్డి యాదగిరి, యాచారం, రంగారెడ్డి జిల్లా

### ఈ జీవితానికిది సాలు

**మా** తాతల, తండ్రుల కాలం నుంచి ఒగ్గు కళనే నమ్ముకున్నరు. నేను కూడా దాన్నే నమ్ముకున్నా. మా నాయన నన్ను దేవుడిక్కి పెండ్లి చేసిండు. అప్పటి నుంచి నా జీవితం దేవుడికే అంకితం చేసిన. నేను వేలకొద్దీ దేవుడి లగ్గాలు, పూజలు చేయించిన. ఎన్నెన్నో ఒగ్గు కథలు చెప్పిన. ఎన్ని చేసినా.. తెలంగాణ వచ్చిందాక నాకు గుర్తింపు రాలె. కేసీఆర్ సార్ సీఎం అయ్యాకనే నేను అందరికి తెలిసిన. రవీంద్రభారతిలో చక్కగ సన్మానం చేయించిండు. అది నాకు జరిగింది కాదు. మన తెలంగాణ కళ ఒగ్గు కథకు జరిగిన ముచ్చట. ఆయన లెక్కనే ప్రతి ఒక్కరూ జానపద కళలను ఆదరించాలె. కళను బతికించాలె. నా వరకైతే, నేను బతికున్నంత కాలం ఒగ్గు కథలు చెప్తా! ఈ జీవితానికి ఇది సాలు.

• జమ్మ మల్లారి



# తల్లులకు వాయుగండం!

**గాలి** కాలుష్యం.. గర్భిణులపై తీవ్రప్రభావం చూపుతున్నది. అకాల ప్రసవాల ప్రమాదాన్ని పెంచడంతోపాటు గర్భస్థ శిశువుల్లో అనేక సమస్యలకు కారణం అవుతున్నది. అమెరికాలోని ఎమోరీ విశ్వవిద్యాలయ పరిశోధకులు నిర్వహించిన తాజా సర్వే ఈ విషయాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఎన్విరాన్మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇందులో అనేక విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో భాగంగా అట్లాంటా మెట్రోపాలిటన్ ప్రాంతంలోని 330 మంది ఆఫ్రికన్–అమెరికన్ గర్భిణుల రక్త నమూనాలను పరిశోధకులు విశ్లేషించారు. వీరిలో నగర శివార్లలో నివసించే వారితో పోలిస్తే.. అనేక రహదారులు కలిసే డౌన్‌టౌన్, మిడ్‌టౌన్ పరిసరాల్లో నివసించేవారు ఎక్కువ స్థాయిలో కాలుష్యానికి గురవుతున్నారట. ఇలా కాలుష్యం బారిన పడుతున్న గర్భిణుల్లో.. కార్టెక్సోలోన్, లైసో పీఈ అనే కాంపౌండ్స్ తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ కాంపౌండ్స్ పిండం అభివృద్ధికి, రోగనిరోధక పనితీరులో కీలకంగా వ్యవహరిస్తాయట. అయితే, వాయు కాలుష్యానికి గురికావడం వల్ల.. అకాల ప్రసవాలకు కారణం అవుతున్నాయని పరిశోధకులు వెల్లడించారు. పరిశోధనలో పాల్గొన్న 330 మంది మహిళల్లో.. 66 (20 శాతం) మంది నెలలు నిండని శిశువులకు జన్మనిచ్చారట. మరో 54 (16.4 శాతం) మందికి గర్భధారణ సమస్యలతో ముందస్తు ప్రసవాలు అయినట్లు వెల్లడించారు. నెలలు నిండక ముందే పిల్లలు పుట్టడం వల్ల.. వారిలో ఊపిరితిత్తులు అభివృద్ధి చెందకపోవడం, తక్కువ బరువు, దీర్ఘకాలంలో రోగనిరోధక వ్యవస్థ దెబ్బతినడం లాంటి సమస్యలు కనిపిస్తున్నాయి. కొన్నిరకాల కాలుష్య కారకాలు ప్లాసెంటాను దాటి వెళ్లడంతో.. నవజాత శిశువుల్లో ఆకస్మిక మరణాలూ సంభవిస్తున్నాయని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి, గర్భిణులు వీలైనంతమేరకు కాలుష్యానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు వెళ్లేసమయంలో మాస్క్ పెట్టుకోవాలనీ, వాహనాల రద్దీ తక్కువగా ఉండే సమయంలోనే బయటికి వెళ్లాలని చెబుతున్నారు. ఇళ్లల్లోనూ కాలుష్యాన్ని తగ్గించేలా మొక్కలను పెంచుకోవాలని అంటున్నారు.

అమ్మాయిలు ఆపాదమస్తకం అందంగా కనపడాలని కోరుకుంటారు. అందుకు తగినట్లుగానే అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, ఎన్ని సౌందర్య చిట్కాలు పాటించినా, సీజనల్‌గా కొన్ని సమస్యలు పలకరిస్తూనే ఉంటాయి. వానకాలంలో తేమ ఎక్కువగా చేరి పాదాల్లో పగుళ్లు ఏర్పడతాయి. వాటిలోకి ఫంగస్ చేరి ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుంది. వర్షాకాలం వచ్చేసింది.. ఈ కాలంలో పాదాల పగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం..

# పాదాలకు రక్షణ కవచం

- డ్రై స్కిన్ ఉన్నవారికి పాదాలు ఎక్కువగా పగులుతాయి. యాంటి మైక్రోబియల్, యాంటి బ్యాక్టీరియల్ గుణాలున్న తేనె.. పగిలిన పాదాలకు చక్కని మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది. రోజూ రాత్రిపూట పాదాలకు పగుళ్లు ఉన్నచోట కొద్దిగా తేనె రాసి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పగుళ్లు తగ్గుముఖం పడతాయి.
- వారానికి ఒకసారి అయినా.. డెడ్ స్కిన్ సెల్స్‌ను క్లియర్ చేసుకోవడానికి ఎక్స్‌ఫోలియేట్ చేయాలి. స్క్రబ్ లేదా స్టోన్‌తో పాదాలను మృదువుగా ఎక్స్‌ఫోలియేట్ చేయాలి. కొబ్బరినూనెలో కాస్త కర్పూరం అరగదీసి పాదాలు, వేళ్ల సందుల్లో రాసుకుంటే.. ఒరుపులు, పగుళ్లు తగ్గుతాయి.



- బేకింగ్ సోడా నీటిలో కలిపి కాళ్లను శుభ్రం చేయాలి. తడిలేకుండా పొడివస్త్రంతో తుడిచి పెట్రోలియం జెల్లీ రాసుకోవాలి. దీనివల్ల రెండు సమస్యలూ అదుపులోకి వస్తాయి. వారానికోసారైనా ఆలివ్‌నూనెకు కాస్త రోజ్‌వాటర్ కలిపి పాదాలకు రాయండి. మంచి ఔషధంగా పనిచేస్తుంది.
- నానబెట్టి పొట్టు తీసిన బాదం పప్పు క్రమం తప్పకుండా తింటే పాదాలు పగలవు. పాదాలను కాసేపు నీటిలో నానినిచ్చి స్క్రబ్బర్ లేదా ప్యూమైస్ స్టోన్‌తో రుద్దాలి. తరచూ ఇలా చేస్తే పగుళ్లు పోతాయి. పగిలిన పాదాలకు అరటి పండు గుజ్జు రాయాలి. ఇందులో ఉండే ఎ, బి6, సి విటమిన్లు చర్మాన్ని మృదువుగా చేస్తాయి.



అతివల అందంలో ఆభరణాలది ప్రత్యేక స్థానం. అందులోనూ ట్రెండ్‌కి తగ్గట్టు ఎప్పటికప్పుడు వెరైటీ నగలను ఎంచుకుంటున్నారు ఆధునిక మగువలు. పెరుగుతున్న నాగరికతతోపాటు ఆభరణాల్లోనూ నయా హంగులు కోరుకుంటున్నారు. అలాంటి ట్రెండీ లుక్ అంటే ఆసక్తి చూపించే అమ్మాయిల కోసం కొత్తకొత్త ఆభరణాలను తయారు చేస్తున్నారు డిజైనర్లు. చూడటానికి వింతగా, కొత్తగా ఉండే చంకీ జువెలరీ ఆ కోవకు చెందినదే.

# చంకీ చమక్





నగ ధగలు

**దుస్తుల్లో** ఫ్యాషన్ ఎప్పటికప్పుడు మారిపోయినట్లే, ఆభరణాల్లోనూ రోజుకో ట్రెండ్ పుట్టుకొస్తుంటుంది. ఓవైపు మేనిపై మెరిసిపోతూ కంటికి కనిపించనంత సన్నటి గొలుసులతో కూడిన మినిమలిస్ట్ జువెలరీ రాజ్యమేలుతున్నది. మరోవైపు భారీ పరిమాణాల్లో గొలుసులను పోలిన చంకీ జువెలరీ ఆకట్టుకుంటున్నది. రోజురోజుకీ బంగారం ధర పెరిగిపోతుంటే తక్కువ బంగారంతో ఎక్కువ మెరుపునిచ్చే చంకీ జువెలరీ ఈ తరం యువతుల ఆదరణ చూరగొంటున్నది. ఈ ఆభరణాలు పెద్ద లింక్‌లు, మందమైన గొలుసులు, జ్యామితీయ ఆకృతులలో భిన్నంగా ఉండి నలుగురిలో ప్రత్యేకంగా నిలుపుతాయి. మందంగా ఉండే చైన్ నెక్లెస్, ఓవర్ సైజ్డ్ హూప్ ఇయర్‌రింగ్స్ సాధారణ దుస్తులపై కూడా ట్రెండీలుక్ తీసుకొస్తాయి. ఈ డిజైన్లు 1980ల రెట్రో ఫ్యాషన్‌ను మరిపిస్తున్నాయి. సాధారణంగా ఈ ఆభరణాలు తరచూ 18K, 22K బంగారంతో తయారు చేస్తున్నారు. చూడటానికి భారీగా కనిపించినప్పటికీ లోపల గుల్లగా ఉండటం వల్ల వీటి తయారీకి తక్కువ బంగారం అవసరమవుతుంది. ప్రస్తుతం ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో మహిళలు బంగారాన్ని ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గానే కాకుండా పెట్టుబడిగానూ భావిస్తున్నారు. ఈ ఆభరణాలను ఆధునిక దుస్తులతోపాటు సంప్రదాయ దుస్తులపైనా ధరించవచ్చు. అంతేకాదు ఆడ, మగ తేడా లేకుండా ఎవరైనా చంకీ జువెలరీని ఎంపిక చేసుకోవచ్చు. అందరికీ అందుబాటులో ఉండేలా వెండి, ఇమిటేషన్, వన్‌గ్రామ్ గోల్డ్‌లోనూ ఈ చంకీ నగలు అందుబాటులో ఉన్నాయి. మరెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేయండి!

# దోమలు పరార్!

**వర్షాకాలం మొదలు కాబోతున్నది. వర్షాలతోపాటే దోమల బెడద పెరగనున్నది. వాటితో వ్యాధుల ముప్పు కూడా రాబోతున్నది. ఈ క్రమంలో బాల్కనీ, టెర్రస్‌పై కొన్నిరకాల మొక్కలను పెంచుకుంటే.. దోమలతో ఇబ్బంది తప్పుతుంది.**

**వేప:** ఎన్నో ఔషధ గుణాలు కలిగిన వేప.. సహజసిద్ధమైన పురుగుమందుగా పనిచేస్తుంది. ఇప్పటికీ ఊళ్లలో దోమలు, క్రిమికీటకాలను తరిమేసేందుకు వేపాకులను కాల్చి.. పొగ బెడుతుంటారు. వేపనూనెతోనూ దోమలను తరిమికొట్టొచ్చు. కాబట్టి, మీ పెరటి తోటలో ఓ వేప మొక్కను నాటండి. ఇప్పుడు ‘బోన్సాయ్’ రూపంలోనూ వేప చెట్లు పెరుగుతున్నాయి. వాటిని బాల్కనీలో పెంచుకోండి.



**లావెండర్:** ఈ మొక్కల వాసన చాలా ఘాటుగా ఉంటుంది. దోమలను తరిమేస్తుంది. ఇంటి గుమ్మం, కిటికీల దగ్గర లావెండర్ మొక్కలను పెంచితే.. ఇంటికి కొత్త అందం రావడంతో పాటు దోమల బాధ కూడా తప్పుతుంది.

**తులసి:** వీటి ఆకుల నుంచి సుగంధమైన, ఘాటు వాసనలు వస్తాయి. ఇవి మనిషికి ఆరోగ్యాన్ని అందిస్తే.. దోమలకు అసహ్యంగా ఉంటాయి. అందుకే.. తులసి మొక్క ఉన్నచోట దోమలు వృద్ధిచెందవు. ఓ తులసి మొక్క పెంచడం వల్ల.. ఇల్లు మొత్తం ఔషధ గుణాలతో కూడిన గాలి వ్యాపిస్తుంది. ఆరోగ్యానికీ మేలుచేస్తుంది.

**బంతి మొక్క:** ఈ మొక్క నుంచి వచ్చే ఘాటు వాసనలు కూడా.. దోమల నిరోధకంగా పనిచేస్తాయి. దోమల మందుల్లోనూ బంతిపూల తైలాలను వాడతారు. అందుకే ఇంట్లో బంతి మొక్క పెంచడం చాలా ఉపయోగకరం.

**నిమ్మగడ్డి:** దోమలను తరిమికొట్టడంలో నిమ్మగడ్డి అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే ‘సిట్రోనెల్ల ఆయిల్’.. దోమల నివారణలో ముందుంటుంది. అందుకే.. దోమల మందుల్లోనూ ఈ నూనెను వాడుతారు. ఈ మొక్క ఆకులను కొద్దిగా నూరి.. ఆ వాసన ఇంట్లో వ్యాపించేలా చేస్తే.. దోమలు పారిపోతాయి.

# గేమర్స్ కోసం..

**స్మార్ట్‌ఫోన్‌లో** ఎన్ని ఫీచర్లు ఉన్నా, వీడియో గేమ్స్ ఆడాలంటే.. గేమింగ్ కన్సోల్ ఉండాల్సిందే! ఆ జాయ్ స్టిక్స్, ప్రత్యేకమైన బటన్స్‌తో గేమ్స్ ఆడుతుంటే వచ్చే ఫీలింగే వేరు! అలాంటి గేమింగ్ లవర్స్ కోసం మరో సరికొత్త కన్సోల్ వచ్చేసింది. ‘నింటెండో’ సంస్థ నుంచి ‘స్విచ్ 2’ ఇటీవలే మార్కెట్లోకి విడుదలైంది. ఇప్పటికే లక్షల సంఖ్యలో అమ్ముడైన ‘నింటెండో స్విచ్ 1’కు అప్‌డేట్ వెర్షన్‌గానే ఈ ‘స్విచ్ 2’ రూపొందింది. స్విచ్ 2 ఫీచర్ల విషయానికి వస్తే.. ఇందులో 8 అంగుళాల ఇంటర్నల్ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. 1080పి డిస్‌ప్లే, 120 ఎఫ్‌పీఎస్ వరకు ఫ్రేమ్ రేట్లతో గేమర్లకు అద్భుతమైన అనుభవాన్ని ఇస్తుంది. స్విచ్ 1తో పోలిస్తే.. ఇది మరింత శక్తిమంతమైనది. ఇందులో ఏఐ ప్రాసెసింగ్‌కు మద్దతు ఇచ్చే Nvidia అభివృద్ధి చేసిన ఆధునిక ప్రాసెసర్‌ను వాడారు. డాక్ అనుకూల టీవీలలో 4కె రిజల్యూషన్ వరకూ సపోర్ట్ చేస్తుంది. ఈ కన్సోల్‌లోని జాయ్–కాన్ కంట్రోలర్లను స్క్రీన్ నుంచి విడదీయొచ్చు. వాటిని టేబుల్‌పై ఉంచి.. కంప్యూటర్ మౌస్ లాగా వాడుకోవచ్చు. ఇందుకోసం వీటిలో ‘ఇన్‌బిల్ట్ ఆప్టికల్ సెన్సార్’ను ఏర్పాటుచేశారు. అనేక ఫీచర్లతో వస్తున్న ఈ కన్సోల్.. గేమింగ్ లవర్స్‌కి సరికొత్త అనుభూతిని అందిస్తుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

